కథానిక

# కను విప్పు

వల్లూరి కృష్ణారావు

టైపుమిషనులు డబడబలాడుతున్నాయి. పైని తిరిగే పంకాల గాలికి టేబుల్సుమీద చిందర వందరగా దొంతర్లుగాపడి ఉన్న ఫైళ్ళు రెపరెపలాడుతున్నై. గుమాస్తాలందరూ యంత్రంలోని సామాగ్రిలా పనిచేస్తున్నారు. 'క్లరికల్ హాల్' అంతా వట్టి 'మెకానికల్'గా నడుస్తోంది!

"దొరగారు పిలుస్తున్నారు." 'హెడ్'గుమాస్తా రామనాథం వ్రాస్తున్న కాగితాలు 'టేబుల్'పై పెట్టి లేచివెళ్ళాడు.

"ఏంసార్. పిల్చారుట" అన్నాడు విధేయత ఉట్టిపడుతూ ఆఫీసరు విశ్వనాథశాస్త్రి తలపైకెత్తి చూసాడు. విశ్వనాథశాస్త్రి మామూలు 'క్లార్కు' నుంచి పైకివచ్చాడు. ఇదంతా ఆయన తెలివని, స్వయంకృషని అంతా అంటూరు. ఆయన తెలిసిన వాళ్ళు 'అబ్బో. వాడెక్కడా! తలలుమార్చే తోడేలు!' అంటారు కొంతమంది అసూయాపరులో పెట్టి పుట్టాడు. సిరి అబ్బింది. విధివ్రాత అంటూరు రామనాథంలాటివాళ్లు; కాని రామనాథం తనతోటి వాడు ఆఫీసరయి కూర్చుంటె తాను మామూలు 'ఎల్. డి. సి'గానే ఉన్నాడే అనే దిగులు, చింత ఆయనలో ఉన్నా (ఉంటే!) పైకి మాత్రం అలాటి ఛాయలేమీ ఇతరులకు కనపడ నీయడు. ఏమయినా విశ్వనాథశాస్త్రి అదృష్టవంతుడు! ఒక మంచి అర్ధరాత్రివేళ జరిగిన పనిలా అమాంతంగా అనుకోకుండా అందరికీ ఆశ్చర్యం కలిగించాలా 'లిఫ్టు'వచ్చింది. ఈ 'లిఫ్టు'చాలామందికి బాధ, జుగుప్స కలిగించినమాట వాస్తవం. అసలు విశ్వనాథశాస్త్రి ఈ 'లిఫ్టు'కోసం ప్రయత్నించడం గాని, ఆశించడంగాని జరగలేదంటే ఏ రామనాథమో తప్ప మిగతా వాళ్ళెవ్వరూ నమ్మరు.

"చూడండి. రామనాథంగారూ! నిన్నచెప్పిన కాగితం 'డిస్పాచికి' సిద్ధంచేశారా?"

"చిత్తం"

"అందుకే పిల్చాను"

"ఇప్పుడే సంతకానికి పంపిస్తానుసర్"

"అదిసరే..." ఏదోచెప్పడానికి ప్రయత్నించి చెప్పడమా? వద్దా? అన్నట్టు సంశయిస్తున్నాడు విశ్వనాథశాస్త్రి; రామనాథం అయోమయంగా చూస్తున్నాడు.

"చూడండి. మీరేగుర్తుకు తెస్తారనుకున్నాను మన పూర్వపు పరిచాయాన్ని ఇద్దరం ఒకే 'సెక్షను'లో ఉండేవాళ్ళం."

"అవునుసర్. అంతస్తులు మారాక పూర్వపు విషయాలను ప్రస్తావించడం సముచితం కాదని ఊరుకున్నాను"

విశ్వనాథశాస్త్రి ఆశ్చర్యంగా రామనాథం వంక చూశాడు.

"రామనాథంగారూ నేను ఒకటి అడుగుతాను ఏమీ అనుకోరుగదా! నిజంగా నేను అనుకుంటాను మీకు ప్రభుత్వం అన్యాయం చేసిందని 'వర్కు' విషయంలో మీరేనాకన్న..."

"అలాటిదేమీ కాదుసర్..."

"నాకు తెల్సులెండి. ఏమీ అనుకోరుకదా. ఒకటి అడుగుతాను. అడగమంటారా?"

"చెప్పండి." రామనాథం అన్నాడు.

"మీకు నన్నుచూస్తుంటే అసూయగాలేదూ?"

పైన పంకా గిరగిరా తిరుగుతోంది రొదచేస్తూ.

"నాకా?"రామనాథం ఆశ్చర్యంగా అడిగాడు. ఏనాడయినా రామనాథం విశ్వనాథశాస్త్రి అదృష్టానికి బాధపడ్డాడా? ఒకవేళ తాను అలా బాధ పడలేదుసార్ అంటే నమ్ముతాడావిశ్వనాథశాస్త్రి?

"మీరు నమ్ముతారా నేను అసూయపడ్డం లేదనంటేమాత్రం? అది సరే సార్. కాగితాలు పంపిస్తాను" రామనాథం ఇవతలపడ్డాడు. రామనాథం ఆవేళంతా తెలియనిబాధ పడ్డాడు. విశ్వనాథశాస్త్రి మాటలకర్థం కాకుండా ఉంది తనకు.

ఆయన మాటలను తర్చు నెమరకు తెచ్చుకొని వానిభావాన్ని తెలుసుకోవడానికి ప్రయత్నించి విఫలుడై ఆ విషయం వదిలేశాడు. కాని విశ్వనాథ శాస్త్రి విషయంలో ఏదో తాను తెలుసుకున్నట్లు మాత్రం అనుకున్నాడు.

విశ్వనాథశాస్త్రి మరీ ఆందోళనగా ఉన్నాడు. రామనాథం జవాబు అలా ఉంటుందని ఊహించి ఉండడు. తను అనుకున్నది "నేను అసూయపట్టం లేదుసార్. అంతా విధివిలాసం" అని రామనాథం అంటాడని, బహుశా అయి ఉండచ్చు. డొంక తిరుగుడుగా సమాధానం చెప్పాడు రామనాథం. అసలెందుకడిగానా? అనుకున్నాడు రామనాథ శాస్త్రి. ఇలాటివాళ్లు చాలమంది ఉంటారు సమాజంలో. అడగనా? వద్దా? అనే నిర్ధారణకురాలేని 'హేమ్ లెట్టు' లుంటారు. అడుగుతారు పట్టలేక. తీరా అడిగాక ఎందుకడిగానూ? అని తమకు తర్చి చూసుకుంటారు తర్వాత "అలా చెప్పతాడే?" అనుకుంటారు. తామన్నదిమాత్రం నెమరుకు తెచ్చుకోరు. పునశ్చరణ చేసుకోరు.

ఆఫీసరు విశ్వనాథశాస్త్రి ఉన్నట్టుండి ఒక నాడు అనుకోకుండా 'క్లరికల్ హాల్' లోకి వచ్చాడు. 'చట్' మని గుమాస్తాలంతా లేచి నిలబడ్డారు. రామనాథంతో ఏదో మాట్లాడి తిరిగి వెళ్ళిపోబోయాడు. హాలుదాటగానే ఒక ప్రాణి పగలబడి నవ్వుతోంది. ఏదో అస్పష్టంగా మాటలు వినవస్తున్నాయి. విశ్వనాథశాస్త్రి కళ్ళు ఎఱ్ఱబడ్డయ్. ఉగ్రుడై 'కాలింగ్ బెల్' నొక్కాడు. ఒక్కక్షణంలో 'సార్'అంటూ ప్రత్యక్షమయ్యాడు రామనాథం.

"ఎవరా ఇందాక నవ్వింది? మీరేంచేస్తున్నారు? 'డిసిప్లినరీ ఏక్షను' ఎందుకు తీసుకోకూడదూ?"

"చిత్తం"

"చిత్తం కోసంకాదు నేను అడుగుత రామనాథంగారూ."

"క్షమించండి. అసలెందుకు నవ్వాడో ఆ అబ్బాయి కారణం తమరు వింటే తమరుకూడా నవ్వకుండా ఉండలేరు. మిగతావాళ్లు కాస్త మోతాదుగానూ, ఆ అబ్బాయికాస్త ఉపద్రవంగానూ, నవ్వినమాట వాస్తవమే. తమరు వచ్చేరనే తొందరలో ఆ టైపిస్టు కంగారుపడి లేవబోయాడు. ఆ ఖంగారులో తనపంచె 'స్టూల్' మేకుకు పట్టుకొని పంచె చర్రున చినిగింది. ఆ ఖంగారుచూసి నవ్వేశాడు. అంతే."

విశ్వనాథశాస్త్రి నవ్వుకున్నాడు. "ఇంతేనా?" అన్నాడు. ఏదో అనుకున్నాడు విశ్వనాథశాస్త్రి. తననీడ చూసి తాను జడుసుకున్నాడు పాపం! విశ్వనాథశాస్త్రి! తెప్పరిల్లి "అయినా అంతనవ్వు ఆరోగ్యమయింది కాదని కూకలెయ్యండి. సరే వెళ్ళండి."

విశ్వనాథ శాస్త్రి సిగ్గుపడ్డాడు. తన ఖంగారుకు అనాలోచనగా చేసేస్తాడు మొదట తర్వాత విచారపడ్తాడు. అనుమానపు తెర మళ్ళా ఆవహించింది విశ్వనాథశాస్త్రిని. రామనాథం చెప్పింది నిజమేనా? వెంటనే సమాధాన పరుచుకున్నాడు. రామనాథం అలాటి వాడు కాదని వాళ్ళనవ్వులు తననుచూసి కాదన్నమాట! తాను అపార్థం చేసుకున్నాడా? విశ్వనాథశాస్త్రికి, తాను మామూలుస్థితికి రావడానికి చాలసేపు పట్టింది.

రామనాథం ఒక సెలవు రోజున విశ్వనాథ శాస్త్రి ఇంటికి వెళ్ళడం జరిగింది. విశ్వనాథశాస్త్రి చంటికుఱ్ఱాడు రామనాథం కాళ్ళకు పెనవేసుకున్నాడు. వచ్చిన పని మరిచి రామనాథం బాబుతో ఆడుకోసాగాడు. విశ్వనాథ శాస్త్రితో మాట్లాడుతున్నంతసేపూ రామనాథం వళ్ళోనే ఉన్నాడు 'బాబు'

విశ్వనాథశాస్త్రి రామనాథంకేసి తీక్షణంగా చూస్తున్నాడు. దట్టమయిన నల్లని అనుమానపు తెర కప్పివేసింది విశ్వనాథశాస్త్రిని.

రామనాథంది ఉత్తినటన! తనె మెప్పుకోసం తన కుఱ్ఱాడితో దోబూచు లాడుతున్నాడు. నిజంగా అంతే. తాను గుమాస్తాగా ఉన్నప్పుడు? ఆ ఉన్నప్పుడు? అవును.

తను ఆఫీసరు కొడుకునేకాదు ముద్దుగాచూస్తః తన ఆఫీసరు హైగరునికూడా! హైగరుని పొగిడి మరీ ఆఫీసరుని పొగిడేవాడు. ఐదుసెల్ల పాపడి ప్రతీచేష్టకు అర్థంచెప్పే వాడు విశ్వనాథశాస్త్రి ఆఫీసరుకు, ఆఫీసరుకు ముసిముసి నవ్వులు మీసాల సందుల్లోంచి ఒలక బోసేవాడు. విశ్వనాథశాస్త్రి ఏనుగంతయ్యేవాడు ఆఫీసరు చిరునవ్వుల కోసం, మెప్పుకోసం! ఒక్క. ఛీ! ఛీ!! కుక్కనుడాకూ

మీ మెక్కించుకొనేవాడు ఆనాడు ఆఫీసరనేవాడు. "నీకు కుక్కలకీ, చిన్న పిల్లలకీ తేడాకూడా తెలియదు 'మేన్!' ముద్దులతో నులిపేస్తున్నావు వాళ్ళని." విశ్వనాథశాస్త్రి "సబ్ మిసివ్" నవ్వు నవ్వేవాడు. మానవనైజం అంతా వక్కటే! తానప్పుడు గుమాస్తా ఇప్పుడాఫీసరు. పూర్వం తనలాంటి గుమాస్తా ఆఫీసరైన ఇప్పటి తన మెప్పుకోసం ప్రాకులాడుతున్నాడు! ఎవరికి తెలియదు గనక! రామనాథంది అంతా నటన ప్రపంచం అంతా పెద్దవారి ప్రాపకాలకోసం ప్రాకులాడే ప్రాణులు అని నిర్ధారణ కొచ్చేసాడు విశ్వనాథశాస్త్రి! విశ్వనాథశాస్త్రి రామనాథాన్ని తెగేసి అడగాలని నిశ్చయించుకొన్నాడు.

"చూడండి రామనాథంగారూ! నాలో అనుకునే విషయాల్ని నాలో దాచుకోవడం చేత కాదు నాకు. కుండ బద్దల కొట్టినట్లు ఎదుటి వాళ్ళకు విప్పి చెప్పివేయవల్సిందే అదే నాలోని "వీక్ నెస్" అనండి మరేదయినా అనండి."

రామనాథానికి విశ్వనాథశాస్త్రి మాటలు ఏమీ అర్థంకాకుండా ఉన్నాయి. రామనాథానికి వినడంతప్ప జవాబు చెప్పడానికి మాటలు దొరకుండా ఉన్నాయి.

"నాకు అనుమానాలు ఎక్కువగా ఉన్నమాట నిజమే. నేను ప్రతీదాన్నీ అనుమానిస్తాను. అనుమానించి ఊరుకోను కూడా లేను. ఇతరులను అడిగి తెలుసుకోవడానికి ప్రయత్నిస్తాను. అలా తెలుసుకోవడంలో తప్పేమీ లేదనుకుంటాను. ఏమీ అనుకోకండి అని మరోమాటు చెప్పినమీదట చెపుదామనుకున్నాను."

రామనాథానికి ఏమీ తెలియకుండా ఉంది. కళ్ళకు గంతలుకట్టి తీసుకువెళ్ళుతున్నాడు విశ్వనాథ శాస్త్రి రామనాథాని .

"మీరు సూటిగా అడగండి. నాకు తెలిసిందైలేనే చెప్పగలను."

"ఏమీలేదు. నేను గుమాస్తాగా ఉన్నప్పుడు ఆఫీసరు ప్రాపకంకోసం అనేక చేష్టలు చేసేవాడిని. మాటవరసకి ఆఫీసరు మెప్పుకోసం నేను ఆఫీసరు కుర్రాణ్ణి విడిచేవాణ్ణి కాదు. నేనే చేసానా? ప్రతీ గుమాస్తా కూడా అలా చేస్తాడా? నాకు తెలియకుండా ఉంది. రామనాథంగారూ! మిమ్మల్ని విడదీసి అడుగుతున్నందుకు క్షమించండి మీరు"

రామనాథానికి అర్థమయింది. గుమాస్తా వాసనలు ఇంకా పోలేదు ఆఫీసరు విశ్వనాథశాస్త్రికి.

"క్షమించండి. మీరు చెప్పేది నాకు అర్థం అయింది. మీ కుర్రాణ్ణి మీ మెప్పుకోసం యెత్తుకున్నా నంటున్నారు. మీరు మీ పూర్వపు అనుభవాలను నెమరుకుతెచ్చుకొని ప్రతిదాన్ని అనుమానిస్తున్నారు. నేను ఆనాడే చెబుదామనుకున్నాను."

విశ్వనాథశాస్త్రి నివ్వెరపోయి వింటూన్నాడు. ఇందాకటి రామనాథం స్థితిలో ఉన్నాడు శాస్త్రి.

"మీరు ప్రతీదాన్నీ అనుమానిస్తున్నారు. చంటి కుర్రాణ్ణి ఆఫీసరు ప్రాపకంకోసం ఎత్తుకుంటారుటండీ! ముఖ్యంగా నాకలాటిదేమీ లేదు. ఎవరి పిల్లలయినా నాకు ముద్దే. మీరు ఇలా ప్రతీదాన్నీ అనుమానంతో చూస్తే మీకు సుఖముండదు పైగా మథన. ఇలాటి విషయాలు పునశ్చరణ చేసుకోక, మీరు గుమాస్తాగా ఉన్నప్పటి బాధలను గుర్తించి మీ క్రిందివారి బాధలను ఇప్పుడు గుర్తించండి. మీ చిరునవ్వుతో వెట్టిచాకిరీచేసే గుమాస్తాల శ్రమను పోగొట్టగలరు. గుమాస్తానుంచి వచ్చిన ఆఫీసరంటే మంచి భావం ఉంటుంది. ఎంచేతంటె గుమాస్తా బాధలు, యాతనలు తెలుసు కనక, వాళ్ళని మామూలు మనుష్యుల్లా అట్టి ఆఫీసరు చూస్తాడని వాళ్ళ నమ్మకం. ఇలాగే అనుకుంటున్నారు మన వాళ్ళంతా. ఆ అభిప్రాయంనుండి వాళ్ళని దూరం చేయకండి దయఉంచి. వాళ్లు అన్నారు కూడా "విశ్వనాథశాస్త్రిగారు నిగర్వి. చాలామంచివారు" అని. అంచేత మీరు మంచినిచ్చి మంచిని తెచ్చుకోండి. మీకు ఇంత ఇదిగా చెప్పుతున్నందుకు క్షమించండి"

విశ్వనాథశాస్త్రిగారు అమాంతంగా లేచి నుంచున్నారు.

"రామనాథంగారూ! నిజంగా నా అనుమానాలతో సతమతమయ్యేవాణ్ణి. నా నీడనుచూసి నేనే భయపడేవాణ్ణి. మీరు నాకు కనువిప్పు కలిగించారు నాకు విషయాలు బోధపర్చి. నిజంగా మీరు నాకు తండ్రిలాంటివారు."

రామనాథం ఆనందంతో తబ్బిబ్బులయ్యాడు. ఆనందంపట్టలేక విశ్వనాథశాస్త్రి కుర్రాణ్ణి ముద్దెట్టుకున్నాడు.

★